
# చలో హైదరాబాద్ వాయిదా

## ఉద్యోగుల ఆకాంక్షలు - జేపీసీ బాధ్యత - ప్రభుత్వం ముందున్న అవకాశం

**తెలంగాణలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమ కార్యక్రమంలో భాగంగా ప్రకటించిన "చలో హైదరాబాద్" కార్యక్రమం వాయిదా పడటం ఉద్యోగ వర్గాల్లో సహజంగానే చర్చకు దారితీసింది. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఈ కార్యక్రమం వైపు చూసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లలో కొంత నిరాశ వ్యక్తమవుతున్నప్పటికీ, ఈ పరిణామాన్ని కేవలం ఒక ఉద్యమ కార్యక్రమం వాయిదాగా మాత్రమే చూడకుండా విస్తృత కోణంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.**




### ఉద్యమాల వెనుక ఉన్నది సమస్యల పరిష్కార ఆకాంక్ష

ఉద్యోగులు ఉద్యమం చేయాలని కోరుకోవడం ఉద్యమం కోసమే కాదు. తమకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కావాలన్నదే వారి ప్రధాన ఆకాంక్ష. పి ఆర్ సి పెండింగ్ డీఏలు, పెన్షన్ సంబంధిత అంశాలు, సీపీఎస్/ఎన్‌పీఎస్, ఉద్యోగుల భవిష్యత్తు భద్రత పదవి విరమణ ప్రయోజనాలు ఆరోగ్య పరిరక్షణ, ఇతర ఉద్యోగ పెన్షనర్ సమస్యలపై స్పష్టమైన పరిష్కారం రావాలని ఉద్యోగ వర్గాలు కోరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఒక భారీ కార్యక్రమానికి పిలుపు ఇవ్వడం సహజంగానే ఉద్యోగుల్లో ఆశలు పెరుగుతాయి. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమీకరణలు నిర్వహించడం, ఉద్యోగులను సమీకరించడం, కార్యక్రమం విజయవంతానికి సన్నహాలు చేయడం జరుగుతుంది. అలాంటి కార్యక్రమం వాయిదా పడినప్పుడు కార్యక్రమంలో కొంత నిరాశ వ్యక్తం కావడం కూడా సహజమే. అయితే ఆ నిరాశను ప్రతికూల భావనగా మార్చకుండా, సమస్యల పరిష్కారానికి తదుపరి మార్గం ఏమిటనే దిశగా ఆలోచించడం అవసరం.

### వాయిదా అంటే ఉద్యమం ముగిసినట్టు కాదు

ఏ ఉద్యమంలోనైనా కార్యాచరణ తేదీలు, కార్యక్రమాల రూపాలు పరిస్థితులను బట్టి మారవచ్చు. ఒక కార్యక్రమం వాయిదా పడిందంటే ఉద్యోగుల సమస్యలు ముగిసిపోయాయని గాని, వాటి ఆకాంక్షలకు ప్రాధాన్యం లేదని గాని భావించాల్సిన అవసరం లేదు. ఉద్యమ కార్యాచరణలో చర్చలు, సంప్రదింపులు, ప్రభుత్వంతో సంభాషణ, అవసరమైతే శాంతియుత ప్రజాస్వామ్య కార్యక్రమాలు అన్ని సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే మార్గాలే. అందువల్ల "చలో హైదరాబాద్" వాయిదాను ఒక ముగింపుగా కాకుండా తదుపరి కార్యాచరణకు ముందు వచ్చిన ఒక విరామంగా చూడటం సముచితం.

### ఉద్యమము- చర్చలు పరస్పర విరుద్ధాలు కావు

ప్రజాస్వామ్యంలో శాంతియుత ఉద్యమం ఒక హక్కు. అదే సమయంలో చర్చలు సమస్యల పరిష్కారానికి అత్యంత ముఖ్యమైన మార్గం. ఉద్యమం చేయడం అంటే చర్చలకు తలుపులు మూసివేయడం కాదు. చర్చలు జరపడం అంటే ఉద్యమం లక్ష్యాలను వదులుకోవడం కూడా కాదు. ఈ రెండింటికీ అంతిమ లక్ష్యం ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం కనుగొనడమే కావాలి. ప్రభుత్వం ఉద్యోగ సంఘాలను భాగస్వాములుగా భావించడం, ఉద్యోగ సంఘాలు ప్రభుత్వ ఆర్థిక, పరిపాలనా పరిమితులను కూడా పరిగణనలోకి తీసుకోవడం - ఈ రెండు దృక్కోణాలు కలిసినప్పుడే సాధికార ఫలితాలకు అవకాశం పెరుగుతుంది.

### జేపీసీపై ఉద్యోగుల ఆశలు ఎక్కువ

వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఉమ్మడి సమస్యలపై ఒకే గొంతుతో మాట్లాడే వ్యవస్థగా జేపీసీకి ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంటుంది. అందుకే ఉద్యోగులు జేపీసీపై ఎక్కువ ఆశలు పెట్టుకుంటారు. ఒక కార్యక్రమాన్ని ప్రకటించినప్పుడు ఎంత ఆస్తిత్వంతో స్పందిస్తారో, అది వాయిదా పడినప్పుడు అంతే ఆస్తిత్వంతో కారణాలు, తదుపరి కార్యాచరణ గురించి తెలుసుకోవాలనుకుంటారు. ఇది నాయకత్వంపై వ్యక్తిగతంగా కాకుండా, నాయకత్వంపై ఉన్న నమ్మకం మరియు అంచనాలకు ప్రతిబింబంగా చూడాలి. ఈ సందర్భంలో జేపీసీ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు స్పష్టమైన సమాచారం అందించడం, తదుపరి కార్యాచరణపై అవగాహన కల్పించడం మరింత విశ్వాసాన్ని పెంచుతుంది.

"చలో హైదరాబాద్" వంటి కార్యక్రమం వాయిదా పడిన సందర్భం ప్రభుత్వము-ఉద్యోగ సంఘాల మధ్య మరింత సానుకూల చర్యలకు అవకాశంగా మార్చుకోవచ్చు ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చించి, ఏ సమస్యలను తక్షణం పరిష్కరించవచ్చు, ఏ అంశాలకు కొంత సమయం అవసరం, ఏ అంశాలకు విధానపరమైన నిర్ణయాలు అవసరం అనే విషయాలపై స్పష్టత ఇవ్వగలిగితే ఉద్యోగుల్లో విశ్వాసం మరింత పెరుగుతుంది. అన్ని సమస్యలకు ఒకే రోజులో పరిష్కారం సాధ్యం కాకపోవచ్చు. కానీ సమస్యల పరిష్కారానికి ఒక స్పష్టమైన కార్యాచరణ, కాలపరిమితి కనిపిస్తే ఉద్యోగుల్లో ఆశాభావం ఏర్పడుతుంది. ఉద్యోగుల సమస్య కూడా గౌరవించాలి. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలనే దృక్పథంతో పనిచేస్తున్నట్లు వారికి స్పష్టమైన భరోసా ఇవ్వాలి. ప్రభుత్వం, ఉద్యోగ సంఘాలు పరస్పర విశ్వాసంతో ముందుకు సాగితే సమస్యలు మరింత సులభంగా పరిష్కరించవచ్చు. ఉద్యోగులు ప్రభుత్వానికి అందించే సేవలు ప్రజలకు ఎంతో కీలకం. అందువల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అనే భేదం లేకుండా ఈ మొత్తం సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చేయడం మరింత ఫలప్రదంగా ఉంటుంది.

### ఐక్యతను కాపాడుకోవడం అత్యంత ముఖ్యం

ఒక కార్యక్రమం వాయిదా పడిన సందర్భంలో ఉద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు రావడం సహజం. కొందరు వెంటనే ఉద్యమ కార్యచరణ కొనసాగించాలని భావించవచ్చు. మరికొందరు చర్చలకు అవకాశం ఇవ్వాలని భావించవచ్చు. అభిప్రాయ భేదాలు ప్రజాస్వామ్యంలో సహజం. అయితే అవి ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీయకూడదు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఉమ్మడి ప్రయోజనాలే కేంద్రబిందువుగా ఉండాలి. వ్యక్తులు, సంఘాలు, నాయకత్వాల కంటే సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఉండాలి. తదుపరి అడుగు స్పష్టంగా ఉండాలి. ప్రస్తుతం అత్యంత ముఖ్యమైనది "ఎందుకు వాయిదా పడింది?" అనే చర్చలోనే నిలిచిపోవడం కాదు. "ఇక ముందు ఏం చేయాలి?" అనే ప్రశ్నకు సమాధానం కనుగొనడం.

ప్రభుత్వం-జేపీసీ మధ్య చర్చలు జరిగితే వాటి పురోగతిని ఉద్యోగులకు తెలియజేయడం అవసరం. పరిష్కారం సాధ్యమైన అంశాలను ముందుగా పరిష్కరించేందుకు ప్రయత్నించాలి. మరింత సమయం అవసరమైన అంశాలకు స్పష్టమైన కార్యాచరణ ఉండాలి. అదే సమయంలో చర్చల ద్వారా ఆశించిన పురోగతి కనిపించని పరిస్థితిలో ప్రజాస్వామ్యబద్ధమైన తదుపరి కార్యాచరణపై ఉద్యోగ సంఘాలు సమిష్టిగా నిర్ణయం తీసుకోవచ్చు.

ప్రభుత్వం లేకుండా ఉద్యోగ వ్యవస్థ లేదు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా ప్రజలకు చేరవు. అందువల్ల ప్రభుత్వం, ఉద్యోగులు పరస్పర ప్రత్యర్థులు కాదు. రాష్ట్ర అభివృద్ధి అనే ఒకే లక్ష్యంలో భాగస్వాములు. ఈ భావనతో సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తే ప్రయోజనాలకు బదులుగా సంఘర్షణ, అనుమానాలకు బదులుగా విశ్వాసం, నిరాశకు బదులుగా ఆశ ఏర్పడుతుంది.

### వాయిదాఒక కొత్త అవకాశంగా మారాలి

"చలో హైదరాబాద్" వాయిదా ఉద్యోగుల్లో ఏర్పడిన నిరాశను ఎవరినీ నిందించే అంశంగా మార్చడం కంటే సమస్యల పరిష్కారానికి ఒక కొత్త అవకాశంగా మార్చుకోవడం మంచిది. జేపీసీ ఉద్యోగుల ఆకాంక్షలను ప్రభుత్వానికి సమర్థవంతంగా తెలియజేయాలి. ప్రభుత్వం కూడా ఉద్యోగుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు ముందడుగు వేయాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఐక్యతను కాపాడుకుంటూ ఓర్పుతో పరిణామాలను గమనించాలి.

**"ఉద్యమ లక్ష్యం ఉద్యమే కాకూడదు - సమస్యల పరిష్కారమే అంతిమ లక్ష్యం కావాలి. వాయిదా నిరాశకు కారణం కాకూడదు. ప్రభుత్వం - ఉద్యోగ సంఘాల మధ్య పరస్పర విశ్వాసం పెరిగి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్న సమస్యలకు సానుకూల పరిష్కారాలు లభించాలని ఆశిద్దాం."**



**మహమ్మద్ ఉస్మాన్ పాషా,**
అధ్యక్షులు,
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, కరీంనగర్ జిల్లా శాఖ

---

## గణేష్ ఉత్సవాల వేళ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

❖ *సికింద్రాబాద్ జోన్ సెంట్రల్ పీస్ కమిటీ*



**దశ, సికింద్రాబాద్ :** రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సికింద్రాబాద్ జోన్ పరిధిలోని గణేష్ మండపాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణపై సెంట్రల్ పీస్ కమిటీ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించింది. నగరంలో ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, మతసామరస్యంతో నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు అధికారులు, పీస్ కమిటీ ప్రతినిధులు ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. మండపాల వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ డీసీపీ ఎం.ఎస్. రక్షితా కృష్ణమూర్తి ఐపీఎస్, అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి, గాంధీనగర్ ఏసీపీ యాదగిరి, ఓయూ ఏసీపీ జగన్ తో పాటు జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు. అలాగే సెంట్రల్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్ శ్యామ్, మాజీ ఏజీపీఏ అబ్దుల్ కబీర్, ఉపాధ్యక్షులు ఫరీదుద్దీన్ యూనుస్, మాడపు చంద్రశేఖర్, డాక్టర్ యూసుఫ్ హామీది, కన్వీనర్ సయ్యద్ ఖలీద్ షా చిస్తీ, సభ్యులు శ్రీలత, బసంతి కౌర్, మల్లం రమేష్, అరఫాత్, మొహమ్మద్ అలీ, జహంగీర్, తదితరులు హాజరయ్యారు.

## సీఎంను కలిసిన చిలుక మధుసూదన్‌రెడ్డి



**దశ, హైదరాబాద్:** ఉప్పల్ బగాయత్‌లో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనం భూమిపూజ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

## సాయి నగర్‌లో ఘనంగా వినాయక మండపం ప్రారంభం

❖ *కోట నిర్మలమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సొంత నిధులతో మండపం నిర్మాణం*




**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** పిగ్లిపూర్ గ్రామంలోని సాయి నగర్ టౌన్‌షిప్‌లో వినాయక మండపాన్ని ఘనంగా ప్రారంభించారు. పిగ్లిపూర్ సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి తల్లి కోట నిర్మలమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త కోట రామిరెడ్డి, కుమారుడు కోట ప్రభాకర్‌రెడ్డి, కోడలు సుజాత, మనుమలు నికిత, రితీష్‌రెడ్డి, సాయి తేజరెడ్డి కుటుంబ సభ్యులు తమ సొంత నిధులతో వినాయక మండపాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో పిగ్లిపూర్ సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ దుర్గం నరసింహయాదవ్, వార్డు సభ్యులు జక్కుల శివకుమార్, జక్కుల ఝాన్సీ, ఆంజనేయులు, వర్ధన్ లావణ్య, హనుమంతు, జక్కుల పరమేష్, పంది మురళీకృష్ణ, కొండ రమేష్, కొలను హరిణి, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే పిగ్లిపూర్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు, చిన్నారులు, సాయి నగర్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో జరిగిన మండపం ప్రారంభ కార్యక్రమంతో సాయి నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

## తార్నాకలో మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ

❖ *పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: మాజీ మేయర్ బండ కార్తిక రెడ్డి*



**దశ ఓయూ:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తార్నాకలోని లక్ష్మీ గణపతి దేవాలయంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తిక రెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బండ కార్తిక రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమవడంతో పాటు జలచరాలకు, పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు నిమజ్జన సమయంలో ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజలంతా తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తార్నాక డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్ సుబ్బారావు, వేణు యాదవ్, శివారెడ్డి, రామ్‌వర్మ, ఆర్ఎస్ఎస్ గోపాల్, శ్రీనివాస్, సంపత్, వీరన్న, భూపాల్‌రెడ్డి, దేవ, రాధాకృష్ణ, సాయి, కృష్ణ, చరణ్, సత్యారెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించారు.

## మట్టి వినాయకుడినే పూజిద్దాం

*పర్యావరణ పరిరక్షణకు కల్లూరు నివృతి, మహోన్నత్ పిలుపు*



**దశ ఓయూ:** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పిస్తూ కల్లూరు నివృతి, మహోన్నత్ ఆకులు, కూరగాయలు, సహజ పదార్థాలతో వినాయకుడి రూపాన్ని రూపొందించి ప్రదర్శించారు. పీఓపీ, రసాయన రంగులతో తయారయ్యే విగ్రహాల వల్ల జల కాలుష్యం ఏర్పడి జలచరాలు, పర్యావరణం పై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రతి ఇంట్లో మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజించాలని, అనంతరం సహజ పద్ధతిలో నిమజ్జనం చేయాలని కోరారు. పర్యావరణహితమైన మట్టి వినాయకుడినే ప్రతిష్ఠించి ప్రకృతిని కాపాడాలని పిలుపునిచ్చారు.

## భారీ వర్షాలతో చౌటుప్పల్ అతలాకుతలం

❖ *లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు.. రెండు జేసీబీలతో సహాయక చర్యలు.*

❖ *భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్.*



**దశ, చౌటుప్పల్:** పట్టణంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సూచించారు. రాత్రి కురిసిన వర్షానికి 12వ వార్డులోని గాంధీ పార్క్ వెనుక ఉన్న లోతట్టు ప్రాంతాల్లో మూడు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. సమాచారం అందుకున్న చైర్‌పర్సన్ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవితో కలిసి బాధిత ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.
వరద అత్యవసర పనుల కోసం రెండు జేసీబీలను ఏర్పాటు చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

14వ వార్డులో రూబీ ఇంజనీరింగ్ వర్క్స్ షెడ్డు వెనుక నిలిచిన వర్షపు నీటిని జేసీబీ సహాయంతో సర్వీస్ రోడ్డులోని పెద్ద నాలాలోకి ఘాటు తీసి మళ్లించారు. తంగడపల్లి రోడ్డుపై నిలిచిన నీటిని నాగులకుంటలోకి మళ్లించేందుకు చిన్న ఘాటు తీసి నీటిని పంపించారు. హనుమాన్‌నగర్‌లో లక్కారం నుంచి వచ్చే వరద నీరు పారేందుకు ప్రస్తుతం ఉన్న చిన్న మ్యాన్‌హోల్ సరిపోవడం లేదని గుర్తించారు. భవిష్యత్తులో పైభాగం నుంచి వచ్చే నీటిని ప్రత్యామ్నాయ మార్గంలోకి మళ్లించే ఏర్పాట్లు చేస్తామని స్థానిక నాయకులు కామిశెట్టి భాస్కర్‌కు తెలిపారు. వలిగొండ రోడ్డులో కల్వర్టు వద్ద నిలిచిపోయిన వర్షపు నీటిని పక్కనే ఉన్న మోరీలోకి మళ్లించారు. జయభూమి వెంచర్ నుంచి తాలసింగారం చెరువు వరకు ఉన్న ప్రధాన డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్‌కుమార్, కౌన్సిలర్ పాక చిరంజీవి, నాయకులు ఉడుగు రమేష్, బత్తుల విప్లవ్, కామిశెట్టి భాస్కర్, ఎస్ఐ హనుమాన్ ప్రసాద్, ఈఈ రేణుకుమార్, టిడబ్ల్యూఐ సంతోష్, జవాన్లు అంజయ్య, నరసింహ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# విఘ్నాలను తొలగించే వినాయకుడు.. జీవితాన్ని నడిపించే బోధ!




**మట్టి నుంచి మహాగణపతిగా.. పూజ నుంచి పరమార్థం వరకు –**
**వినాయకుడి ప్రతి రూపంలో ఓ జీవన సందేశం!**
**ఎందుకు ముందుగా వినాయకుడినే పూజిస్తాం?**
**వినాయక వ్రతం.. పండుగ కాదు ఓ జీవన పాఠం!**
**వినాయక వ్రతం వెనుక దాగిన ఆధ్యాత్మిక, సామాజిక సందేశం**

||శ్రీ|| శ్రీ గణేశాయ నమః ||

వినాయక చవితి.. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకునే పర్వదినం. ఇంటి ముందు మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించడం నుంచి పూజలు, వ్రతకథ, నైవేద్యాలు, భజనలు, అన్నదానాలు, చివరకు నిమజ్జనం వరకు ప్రతి ఘట్టంలోనూ ఒక ప్రత్యేకత ఉంటుంది. అయితే వినాయక చవితి అంటే కేవలం పూజలు చేయడం, విగ్రహాన్ని ప్రతిష్ఠించడం, నిమజ్జనం చేయడం మాత్రమే కాదు. మనిషి జీవితాన్ని ఎలా నడిపించుకోవాలి? అహంకారాన్ని ఎలా విడిచిపెట్టాలి? జ్ఞానం, వివేకం, సహనం ఎందుకు అవసరం? ప్రకృతిని ఎందుకు కాపాడాలి? అనే ఎన్నో ప్రశ్నలకు సమాధానం చెప్పే పండుగ ఇది.

## పార్వతీదేవి ముద్దుబిడ్డగా.. గణపతిగా అవతరణ




పురాణగాథ ప్రకారం.. ఒకరోజు పార్వతీదేవి తన శరీరానికి పూసుకున్న పసుపుతో ఒక బాలుడిని తయారు చేసి, అతనికి ప్రాణం పోసింది. ఆ బాలుడినే తన కుమారుడిగా భావించింది. తాను స్నానానికి వెళ్తూ ఇంటి ద్వారం వద్ద కాపలాగా ఉండాలని, తన అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించవద్దని ఆదేశించింది. అమ్మ మాటే వేదంగా భావించిన ఆ బాలుడు ద్వారం వద్ద కాపలా కాశాడు. అదే సమయంలో పరమశివుడు అక్కడికి వచ్చాడు. తాను శివుడినని చెప్పినా.. తల్లి ఆజ్ఞను పాటించిన బాలుడు ఆయనను లోపలికి అనుమతించలేదు.

దీంతో శివుడికి, బాలుడికి మధ్య ఘర్షణ జరిగింది. ఆగ్రహానికి గురైన శివుడు బాలుడి తలను వేరు చేశాడు.

తన కుమారుడి మరణాన్ని చూసిన పార్వతీదేవి తీవ్ర ఆగ్రహానికి గురైంది. తన కుమారుడిని తిరిగి బ్రతికించాలని శివుడిని కోరింది. ఆమె కోపాన్ని శాంతింపజేయడానికి శివుడు తన గణాలను పంపి ఉత్తర దిశగా ఎదురైన మొదటి జీవి తలను తీసుకురమ్మని ఆదేశించాడు. వారు ఏనుగు తలను తీసుకువచ్చారు.

ఆ ఏనుగు తలను బాలుడి శరీరానికి అమర్చి శివుడు తిరిగి ప్రాణం పోశాడు. అప్పటి నుంచి ఆ బాలుడు గజాననుడు, గణేశుడు, వినాయకుడు, విఘ్నేశ్వరుడు తదితర నామాలతో పూజలందుకుంటున్నాడు.

## ముందుగా గణపతినే ఎందుకు పూజించాలి?



ఏ శుభకార్యం ప్రారంభించినా ముందుగా గణపతిని పూజించడం మన సంప్రదాయం. దీనికి పురాణపరమైన కారణం ఉంది. దేవతలలో మొదటి పూజ గణపతికే దక్కాలని శివుడు వరమిచ్చాడని పురాణాలు చెబుతున్నాయి.

అయితే దీని వెనుక ఉన్న జీవన సత్యం మరింత గొప్పది. ఏ పనినైనా ప్రారంభించే ముందు ఆలోచించాలి. ఎదురయ్యే అడ్డంకులను ముందుగానే గుర్తించాలి. తొందరపాటు నిర్ణయాలు కాకుండా జ్ఞానం, వివేకంతో ముందుకు సాగాలి. అందుకే గణపతిని విఘ్నేశ్వరుడిగా కొలుస్తారు.

## గణపతి రూపంలోనే గొప్ప జీవన సందేశం





**వినాయకుడి రూపాన్ని నిశితంగా పరిశీలిస్తే ప్రతి అవయవం ఒక సందేశాన్ని ఇస్తుంది.**

- **పెద్ద తల** — విస్తృతంగా ఆలోచించమని చెబుతుంది.
- **పెద్ద చెవులు** — ఇతరులు చెప్పేది ఓపికగా వినమని సూచిస్తాయి.
- **చిన్న కళ్ళు** — ఏకాగ్రతతో లక్ష్యాన్ని చూడాలని చెబుతాయి.
- **తొండం** — పరిస్థితులకు అనుగుణంగా మారే సామర్థ్యాన్ని సూచిస్తుంది.
- **పెద్ద పొట్ట** — జీవితంలోని అనుభవాలను జీర్ణించుకునే సహనాన్ని తెలియజేస్తుంది.
- **చిన్న వాహనం ఎలుక** — అదుపు లేని కోరికలను నియంత్రించుకోవాలనే సందేశాన్ని ఇస్తుంది.

**అంటే గణపతి రూపం కేవలం భక్తికి సంబంధించినది మాత్రమే కాదు.. మంచి జీవితానికి ఒక మార్గదర్శకం.**

## మోదకం.. ఉండ్రాళ్ల వెనుక అర్థమేంటి?



గణపతికి మోదకాలు, కుడుములు, ఉండ్రాళ్లు వంటి నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ. మోదకం బయటకు సాధారణంగా కనిపించినా లోపల తీపిని దాచుకుంటుంది.

మనిషి జీవితంలోనూ నిజమైన ఆనందం బయట కనిపించే ఆర్భాటంలో ఉండదు. జ్ఞానం, సంతృప్తి, మంచితనం, కుటుంబ అనుబంధాల్లోనే అసలైన ఆనందం దాగి ఉంటుంది అనే సందేశాన్ని మోదకం గుర్తుచేస్తుందని భక్తులు విశ్వసిస్తారు.




## 21 రకాల పత్రి.. ప్రకృతితో మన అనుబంధం



వినాయక పూజలో పత్రికి ప్రత్యేక స్థానం ఉంది. అనేక ప్రాంతాల్లో 21 రకాల పత్రిని గణపతికి సమర్పిస్తారు. సంప్రదాయానికి అనుగుణంగా వివిధ రకాల ఆకులను ఉపయోగిస్తారు.

ఇందులో ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు ప్రకృతి సందేశం కూడా దాగి ఉంది. మనిషి జీవితం చెట్లు, మొక్కలు, నీరు, నేలతో ముడిపడి ఉంది. ప్రకృతి లేకుండా జీవనం లేదు. అందుకే వినాయకుడిని పూజించే సమయంలో ప్రకృతిని కూడా గౌరవించాలి అనే ఆలోచనను ఈ సంప్రదాయం మనకు గుర్తుచేస్తుంది.

## చంద్రుడి కథ.. అహంకారానికి చెంపపెట్టు




వినాయక చవితి సందర్భంగా చెప్పుకునే ముఖ్యమైన కథల్లో చంద్రుడి కథ ఒకటి. ఒకసారి గణపతి తిరిగి వస్తున్న సమయంలో ఆయన వాహనమైన ఎలుక ఒక పామును చూసి భయపడటంతో గణపతి కిందపడిపోయాడని పురాణకథ చెబుతుంది. ఈ దృశ్యాన్ని చూసిన చంద్రుడు నవ్వాడట. చంద్రుడి అహంకారానికి ఆగ్రహించిన గణపతి అతడిని శపించాడని కథనం. అనంతరం చంద్రుడు క్షమాపణ కోరడంతో శాపానికి ఉపశమనం కలిగించాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ కథ మనకు చెప్పే సారాంశం ఒక్కటే.. ఎవరినీ రూపాన్ని చూసి అవమానించకూడదు. ఇతరులను ఎగతాళి చేయకూడదు. అహంకారం చివరకు మనకే నష్టం చేస్తుంది.

## స్యమంతకమణి కథ.. అపవాదు ఎంత ప్రమాదకరమో చెబుతుంది




వినాయక చవితి సందర్భంగా స్యమంతకమణి కథను కూడా చెప్పుకునే సంప్రదాయం ఉంది. శ్రీకృష్ణుడిపై స్యమంతకమణి విషయంలో అపవాదు రావడం, ఆ అపవాదును తొలగించేందుకు ఆయన నిజాన్ని వెలికితీయడం ఈ కథలో ప్రధానాంశం. ఈ గాథ మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతుంది. వాస్తవం తెలియకుండా ఒకరిపై ఆరోపణలు చేయడం ఎంత ప్రమాదకరమో.. నిజం చివరకు ఎలా వెలుగులోకి వస్తుందో ఈ కథ గుర్తుచేస్తుంది.

## వ్రతం అంటే కేవలం పూజ కాదు



వినాయక వ్రతం రోజున ఇంటిని శుభ్రం చేసుకుని పూజా స్థలాన్ని సిద్ధం చేస్తారు. మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి, కలశాన్ని ఏర్పాటు చేసి, సంకల్పంతో పూజ ప్రారంభిస్తారు. గణపతిని ఆవాహన చేసి పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, స్నానం, వస్త్రం, గంధం, అక్షతలు, పుష్పాలు, పత్రి తదితరాలతో పూజ నిర్వహిస్తారు. అనంతరం గణపతి నామాలను స్మరించి, వ్రతకథను విని, నైవేద్యాలు సమర్పించి హారతి ఇస్తారు. అయితే వ్రతానికి అసలు అర్థం మన ప్రవర్తనలో కనిపించాలి. వినాయకుడిని పూజిస్తూ.. మనలోని కోపం, అహంకారం, అసూయ, ద్వేషం వంటి విఘ్నాలను కూడా తొలగించుకోవాలి.

## నిమజ్జనం.. జీవితం చెప్పే చివరి సత్యం



వినాయకుడిని మట్టితో తయారు చేసి, కొన్ని రోజుల పాటు భక్తితో పూజించి, చివరకు అదే విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేస్తాం. ఇందులోనే గొప్ప తాత్విక సందేశం ఉంది. మట్టిలో నుంచి వచ్చిన రూపం.. చివరకు మట్టిలోనే కలుస్తుంది. మనిషి ఎంత సంపద సంపాదించినా, ఎంత పేరు తెచ్చుకున్నా, ఎంత అధికారం అనుభవించినా.. చివరకు ప్రకృతిలోనే కలిసిపోవాలి. అందుకే నిమజ్జనం మనకు అనిత్యతను, వినయాన్ని, ప్రకృతితో మనిషి సంబంధాన్ని గుర్తుచేస్తుంది.

## భక్తి ఉండాలి.. పర్యావరణ బాధ్యత కూడా ఉండాలి



కాలం మారుతున్న కొద్దీ పండుగల నిర్వహణలోనూ మార్పులు వస్తున్నాయి. భక్తి పేరుతో అధిక శబ్దం, ప్లాస్టిక్ వినియోగం, రసాయన రంగులు, పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలు పెరుగుతున్నాయి. ఇది వినాయక పండుగ అసలు స్ఫూర్తికి విరుద్ధం.మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించడం.. సహజసిద్ధమైన అలంకరణలు ఉపయోగించడం.. ప్లాస్టిక్‌ను తగ్గించడం.. పర్యావరణహితంగా నిమజ్జనం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత.

## వినాయకుడు మనకు నేర్పేది ఇదే!

వినాయక చవితి ఒక రోజు పూజతో ముగిసిపోవాల్సిన పండుగ కాదు. ఏడాది పొడవునా మన జీవితంలో ఆచరించాల్సిన విలువలను గుర్తుచేసే పర్వదినం.

- ఆలోచించాలి..
- వినాలి..
- నేర్చుకోవాలి..
- సహనంతో ఉండాలి..
- అహంకారాన్ని విడిచిపెట్టాలి..
- కోరికలను అదుపులో పెట్టుకోవాలి..
- ప్రకృతిని కాపాడాలి..
- ఇతరులను గౌరవించాలి..
- సత్యం, ధర్మం వైపు నడవాలి.

**ఇదే వినాయక చవితి అసలైన సందేశం.**

**ఈ పర్వదినాన ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి. ప్రతి మనసులో జ్ఞానం వెలగాలి. ప్రతి కుటుంబంలో ఐక్యత పెరగాలి. ప్రతి సమాజంలో సోదరభావం వెల్లివిరియాలి. విఘ్నేశ్వరుడు ప్రతి ఒక్కరి జీవితంలోని ఆటంకాలను తొలగించి.. జ్ఞానం, ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతులను ప్రసాదించాలని కోరుకుందాం.**

### వినాయక చవితి శుభాకాంక్షలు!

**వక్రతుండ మహాకాయ**
**సూర్యకోటి సమప్రభ**
**నిర్విఘ్నం కురుమే దేవ**
**శుభకార్యేషు సర్వదా..**

సంపాదకులు ..
బండ కల్పన రెడ్డి